క్లుప్తంగా

డబుల్ రోడ్డు నిర్మించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి డబుల్‌రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కామారెడ్డి నుంచి కొత్తపల్లి మీదుగా దుబ్బాక వరకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం రాజుగౌడ్, దమ్మ శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం శంకరయ్య ఉన్నారు.

ప్రభుత్వ విప్‌కు వినతి



తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళా సంఘాల సభ్యులు మంగళవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా సంఘాల సీఏ అన్నల్‌దాస్ కల్యాణి 22 మంది మహిళలను నమ్మించి రూ.15,77,500 తో ఉడాయించిందని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కానీ బ్యాంకు అధికారులు తమనే డబ్బు చెల్లించాలంటున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి బ్యాంకు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరారీలో ఉన్న సీఏ దొరికే వరకు బాధిత మహిళలను డబ్బుల రికవరీ కోసం ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గ్రామస్తులు మంగళవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యాబోధన కుంటుపడి విద్యార్థులకు ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ఇక్కడ నాయకులు ఎడబోయిన రాజు, కిషోర్, ఆంజనేయులు, సత్యనారాయణలు విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోరుట్లపేటలో డ్రగ్స్, గంజాయి నిషేధం, పథకాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లచ్చపేట గోవిందరావుపేట తండాలో ..

కోనరావుపేట: మండలంలోని లచ్చపేట గోవిందరావుపేట తండాలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై కళాజాత నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ పాత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూదూరి సంజీవ్, అంతడ్పుల ఝాన్సీ, లావణ్య, కిన్నెర, శ్రీలత, శిరీష పాల్గొన్నారు.

సన్మానం



ముస్తాబాద్: పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియామకమైన తలారి రాణి నర్సింలును పోతుగల్ మాజీ సర్పంచ్ తన్నీరు గౌతంరావు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో నాంపెల్లి రమేశ్, విశ్వనాథ్ తదితరులున్నారు.

హోటల్‌లో చోరీ

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ హోటల్‌లో చోరీజరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన లచ్చిగారి లింగం హోటల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి హోటల్‌కు తాళంవేసి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం హోటల్ తలుపులు తెరిచి ఉండడంతో పాటు కౌంటర్‌లోని రూ.2వేల నగదు, వస్తువులు కనిపించకపోవడంతో లింగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రుద్రంగి ఏఎంసీ జాప్యం!

- పాలకవర్గ నియామకంలో ఆలస్యం
- ఎదురుచూస్తున్న ఆశావహులు
- రెండు మండలాలకు ఒకే ఏఎంసీ



రుద్రంగి మార్కెట్ కార్యాలయం

చందుర్తి: నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి కలలు నెరవేరడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా పార్టీ నాయకత్వానికి తీపి కబురు పంపడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంపై నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల మార్కెట్ కమిటీలు నియమించగా.. వేములవాడ నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీలపై స్పష్టత రావడం లేదు. వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రత్యేకంగా వ్యవసాయ మార్కెట్‌లు ఉండగా.. చందుర్తి, రుద్రంగి మండలాలకు కలిపి రుద్రంగి ఏఎంసీ మాత్రమే ఉంది. దీనిపై రెండు మండలాలకు చెందిన పార్టీ నాయకులు దృష్టి పెట్టారు. ఎవరికీ వారే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

జాప్యంపై అసంతృప్తి

రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ రిజర్వేషన్ చేయడంతో చందుర్తి, రుద్రంగి మండలాల్లోని బీసీ నాయకుల్లో పోటీ తీవ్రమైంది. ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు చందుర్తి మండలం రాజకీయ భవిష్యత్‌ను ఇవ్వగా.. రుద్రంగి స్వగ్రామం కావడంతో ఏ మండల నాయకులకు అవకాశం ఇవ్వాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. అయితే చందుర్తి మండలంలోని ఓ గ్రామ మాజీ సర్పంచ్ భర్త, శ్రీధర్‌బాబు యువసేన నాయకుడు మార్కెట్ కమటీ చైర్మన్ పంచాయితీని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతోనే జాప్యమవుతుందనే ప్రచారం జరుగుతోంది.

కమిటీ కోసం తీవ్ర పోటీ

చందుర్తి మండలంలోని లింగంపేటకు చెందిన బండారి శేఖర్, ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ మల్లేశం, రామన్నపేటకు చెందిన భీంరాజు కనకరాజు, సనుగులకు చెందిన ఏగోలపు శ్రీనివాస్‌గౌడ్ ఏఎంసీ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చెలుకల తిరుపతి, ధార్నం మల్లేశం సైతం పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.

మొదటి నుంచి చందుర్తి వాసులకే అందలం

గతంలో వేములవాడ మార్కెట్ కార్యాలయంలో సబ్ మార్కెట్‌గా కొనసాగిన రుద్రంగి 2016లో ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. రుద్రంగి మార్కెట్ కమిటీకి తొలి అధ్యక్షునిగా లింగంపేటకు చెందిన దప్పుల అశోక్, రెండోసారి చందుర్తికి చెందిన పొన్నాల శ్రీనివాస్‌రావు, మూడోసారి చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ఏనుగుల శ్రీనివాస్ అధ్యక్షులుగా కొనసాగారు. వరుసగా మూడుసార్లు చందుర్తి మండల నాయకులకే అవకాశం దక్కింది. ఏఎంసీ చైర్మన్ పదవి ఆశిస్తున్న పలువురు నాయకులు ఇప్పటికే ఆది శ్రీనివాస్ వద్ద తమ ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ఓ నాయకుడైతే ఏకంగా తనకే పదవి ఇవ్వాలని, తమరినే నమ్ముకొని ఇన్నాళ్లు పార్టీలో ఉన్నానని బోరున విలపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఎటూ తేల్చుకోలేకపోతున్న విప్

రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గం నియామకంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు సమాచారం. గత మూడు పర్యాయాలకు తమ కు అన్యాయం జరిగిందని, ఇప్పుడైనా న్యాయం దక్కాలని రుద్రంగి నాయకులు కోరుతున్నట్లు తెలిసింది. చందుర్తి మండల నాయకులు సైతం తమకే అవకాశం ఇవ్వాలంటున్నట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వ విప్ ఎటూ తేల్చుకోలేకపోతున్నారని తెలిసింది.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సిరిసిల్లకల్చరల్: పెండింగ్ బకాయిలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు శాతవాహన యునివర్సిటీ డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నేతలు కొలనూరు శేఖర్‌రెడ్డి, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, గెంట్యాల భూమేశ్ మాట్లాడారు. మూడేళ్లుగా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు నిర్వహించలేకపోతున్నామన్నారు. ఉన్నత విద్య లక్ష్యాన్ని నీరుగారుస్తూ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో వేలమంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఎఫ్ నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాల్‌రెడ్డి, రాజేశ్, అధ్యాపకులు అజీమ్ పాషా, దామెర స్వామి, లక్ష్మణ్, చిటికెన వేణుగోపాల్, శరత్, వేణుమాధవ్, చక్రపాణి, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న సీనియర్ సిటిజన్లు

సిరిసిల్ల కల్చరల్: శ్రీశాల వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ల సంఘం కోరింది. బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతిరావుకు వినతిపత్రం అందజేశారు. వారి ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని గతేడాది మాదిరిగానే ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య కోరారు. దీనికి ఈవో సానుకూలంగా స్పందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇక్కడ ఏనుగుల ఎలయ్య, శ్రీగాధ మైసయ్య, గౌరిశెట్టి ఆనందం, ఉప్పుల విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

25న సెస్ వార్షిక ఆదాయంపై విచారణ

- మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిరిసిల్లటౌన్: జిల్లాలోని సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) వార్షిక ఆదాయం ఆవశ్యకతపై విద్యుత్ వినియోగదారులతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఈనెల 25న భేటీ కానుంది. ఈ మేరకు పత్రిక ప్రకటనను సిరిసిల్ల సెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈనెల 25న స్థానిక విద్యానగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారులతో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతించాలని తహసీల్దార్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో తహసీల్దార్ జయంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కొరతతో ప్రభుత్వ పనులు, స్థానిక నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, మాజీ ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, ఏఎంసీ డైరెక్టర పొన్నం పరుశరాములు, ఆసాని లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



తూకం యంత్రాలను అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్

గంభీరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన తూకం యంత్రాలు, తేమ మిషన్లు, టార్పాలిన్ కవర్లను మంగళవారం నిర్వాహకులకు పంపిణీ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి, అక్కపల్లి బాలయ్య, అజ్మీర భాస్కర్, డైరెక్టర్లు కోట లింగం, ప్రభాకర్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పర్శరాంగౌడ్, కోడె రమేశ్ డిమాండ్ చేశారు. హిందూవుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

● దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని, 18న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

● రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలుగ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రమాకాంత్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే కేసులు నమోదు చేస్తామన్నారు.

● పాఠశాల తలుపులు ధ్వంసం

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక పాఠశాల తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దసరా సెలవుల తర్వాత మంగళవారం పాఠశాలను తెరవడంతో తలుపులు పగులగొట్టి ఉన్నాయి. తరగతి గదిలోనే మద్యం తాగినట్లు భావిస్తున్నారు.

● శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఎల్లాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీసీటీవీ, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై మూడు నెలల ఉచిత శిక్షణతో పాటుగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పాసైన వారు ఈనెల 18లోపు పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులు అందించాలన్నారు.

● పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గ్రామానికి చెందిన పెరుమాళ్ల మల్లేశం, హరిదాస్‌నగర్‌కు చెందిన ఉత్తర్ల గంగయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. క్వింటాల్ బియ్యంతోపాటు ఆర్థికసాయం అందించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు శెట్టిపల్లి బాలయ్య, మండే శ్రీనివాస్‌యాదవ్, అందె సతీశ్, కదిరె శ్రీనివాస్‌గౌడ్, బాలకిషన్ పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో సిరిసిల్ల – కామారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... బండలింగంపల్లికి చెందిన బాబు సిరిసిల్ల నుంచి గ్రామానికి బైక్ వెళ్తున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి కరీంనగర్‌కు వైపు వెళ్తున్న కారు వెంకటాపూర్‌లో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాబును చికిత్స కోసం 108లో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

● వృథాగా భగీరథ నీరు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కోసేశారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి గ్రామానికి సరఫరా చేసే పైప్‌లైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి కోశారు. దీంతో పైప్‌లైన్‌లోని నీరు వృథాగా పోతుంది.

బెల్ట్‌షాపు నిర్వహించేందుకు వేలం

- ఆలస్యంగా వెలుగులోకి

తంగళ్లపల్లి : మండలంలోని రాళ్లపేట గ్రామపంచాయతీ పరిధిలో చోద్యం జరిగింది. బెల్టుషాపు ద్వారా మద్యం అమ్మేందుకు గ్రామానికి చెందిన కొందరు పెద్ద మనుషులు సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామంలో ఒక్కరూ మాత్రమే బెల్ట్‌షాపు నిర్వహించాలని వేలంపాట నిర్వహించగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.66 వేలకు వేలంపాటను దక్కించుకున్నాడు. వేలాన్ని ధిక్కరించిన వారికి జరిమానా కూడా విధిస్తామని హుకుం జారీచేయడం కొసమెరుపు. కాగా బెల్ట్‌షాపు కోసం వేలం నిర్వహించడాన్ని గ్రామ యువకులు వ్యతిరేకించడంతో విషయం బయటకు పొక్కింది. ఇలాంటి వేలంపాటలపై జిల్లా అధికారులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి: ఉరేసుకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్ కథనం ప్రకారం.. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన నల్లగొండ శంకరయ్య (65) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారులు లక్ష్మిపతి, శ్రీనివాస్ ఉన్నారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దారి ఏర్పాటు



సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గ్రామంలో వైకుంఠధామానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ×వైకుంఠధామానికి దారేది ₹ అనే శీర్షికన ఇటీవల ×సాక్షి₹ వాట్సాప్‌లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ముళ్ల పొదలు, గడ్డిని తొలగించి దారిని శుభ్రం చేయించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని మూడో వార్డులో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అందించారు. వార్డులోని ఎస్.లక్ష్మీనారాయణకు రూ.17,500, జి. స్వప్నకు రూ.14వేలు, కే.పవన్‌కు రూ.5,500 విలువైన చెక్కులను అందజేశారు.

చిన్న లింగాపూర్‌లో..

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామంలో పలువురికి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బైరినేని రాము సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రేగుల జ్యోతి, చెప్యాల లత, రమ్యకు మంజూరైన రూ.53,500 విలువైన చెక్కులను అందజేశారు. ఇక్కడ సింగిల్‌విండో డైరెక్టర్ నారాయణ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల వెంకటేశ్, రేగుల ఎల్లయ్య, బొలవేని అనిల్, మరిపల్లి మల్లికార్జున్, గుర్రం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న జీడబ్ల్యూఏసీ ప్రతినిధులు

బోయినపల్లి: బోయినపల్లికి చెందిన దాసరి బాబు గతనెల 17న మస్కట్ ఓమన్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. గల్ఫ్ వర్కర్స్ అవేర్ నెస్ సెంటర్ (జీడబ్ల్యూఏసీ) ప్రతినిధులు మంగళవారం బోయినపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.80వేలు ఆర్థికసాయంగా అందించారు. ఇక్కడ జీడబ్ల్యూఏసీ దుబాయి అధ్యక్షుడు కటకం రవి, గంగిపెల్లి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి బిజిలి దేవయ్య, కువైట్ మహేందర్, యాద సుధాకర్, జగిత్యాల్య, చందుర్తి అధ్యక్షులు గొల్లపల్లి సత్యం, మోతె రాములు, పుల్ల సాగర్, ముక్కెర వినోద్, చిట్ల మధు, రవి, సాయి, బాబు తదితరులున్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృత్యువాత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన జెల్ల తులసి అనే రైతుకు చెందిన పాడి గేదె మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. తులసి గేదెను మేతకోసం బండలింగంపల్లి శివారులోని మానేరు వాగు వద్దకు కొట్టుకువెళ్లాడు. మేత మేస్తుండగా వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన సర్వీస్ వైరు తగిలి గేదె మృతిచెందింది. దీంతో రూ. 60వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. గేదె మృతదేహానికి సెస్ లైన్‌మెన్ సత్తయ్య, పశు వైద్యాధికారిణి రేణుక పరీక్షలు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, మహేందర్, పర్శరాములు పరామర్శించారు.

ఘన నివాళి

వేములవాడఅర్బన్/వీర్నపల్లి: పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. చిత్రపటం వద్ద ఘన నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ నారాయణ, మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు. వీర్నపల్లి మండలం.. గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నేడు ప్రారంభం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఏపీఎం దేవరాజు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కేంద్రాన్ని ప్రారంభిస్తారని, రైతులు తమ ధాన్యాన్ని కేంద్రంలోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని కోరారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం 4గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	15	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	09	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	06	448
పార్వతీపురం స్పెషల్	10	672
పార్వతీపురం సాధారణ	12	336

– వేములవాడ

దివ్యాంగుల హర్షం



సమావేశంలో పాల్గొన్న జిల్లా దివ్యాంగుల సంఘం ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: జిల్లా దివ్యాంగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో నిర్వహించిన జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యవర్గం సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఉద్యోగ పోర్టల్ ప్రారంభించి ఉద్యోగాల అపాయింట్‌మెంట్లలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల సంధ్య, ప్రధాన కార్యదర్శి బోగ రాజయ్య, కోశాధికారి ఊరగొండ లత, గౌరవ అధ్యక్షులు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకుంట ఆనవాళ్లు మాయం !

- నివేదిక అందజేసిన రెవెన్యూ శాఖ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి శివారులో సర్వేనంబర్ 750లో మల్లయ్యకుంట ఉందని, కొందరు రైస్‌మిల్లర్లు కబ్జా చేసి నిర్మించారంటూ గతనెల 23న కలెక్టర్‌కు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పలు విభాగాలకు విచారణ నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు. గత 25 రోజులుగా స్థలాన్ని పరిశీలిస్తున్నా కుంట ఆనవాళ్లు దొరకకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. గ్రామ మ్యాప్‌లో మల్లయ్యకుంట ఉన్నట్లు చూపుతున్నా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం కుంట ఆనవాళ్లు లేకపోవడంతో రెవెన్యూ అధికారులు ఆర్డీవోకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. 750 సర్వేనంబర్‌లో మహాలక్ష్మి రైస్‌మిల్ 1.08 గుంటలు, మారుతి రైస్‌మిల్ 1.06 గుంటల్లో ఉందని, లొకేషన్ మ్యాప్ ఆధారంగా నివేదిక అందించినట్లు తెలిపారు. అయితే మల్లయ్యకుంటపై మాత్రం అధికారులు అయోమయంలో పడ్డారు.